క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: మండలంలోని పాతకొత్త గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే యువకుడు శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం మృతుడి కుటుంబానికి తనవంతుగా రూ.50 వేలు నగదు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాది లింగేశ్వరబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దేవేంద్రప్ప తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రామాంజనేయులు

గుత్తి: పట్టణంలోని కేపీఎస్ సినిమా థియేటర్ ఎదురుగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రామంజనేయులు ముందు వెళ్తున్న ఆటోను బైక్‌తో ఢీకొట్టాడు. ఘటనలో అతడికి తీవ్రగాయలు కావడంతో స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే చర్యలు

యాడికి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. మీకు ఏమైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



నల్లప్పకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

గుంతకల్లు రూరల్: దోసలుడుకి పంచాయతీలోని సంగాల గ్రామానికి చెందిన నల్లప్ప వెన్నెముక శస్త్ర చికిత్స కోసం తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సోమశేఖర్‌రెడ్డి ఆదివారం తిరుపతికి వెళ్లి నల్లప్ప(దివ్యాంగుడు)కు పింఛన్ సొమ్ము అందజేశాడు. రానుపోను 700 కి.మీ దూరం వచ్చి పింఛన్ సొమ్ము అందించడంతో నల్లప్ప వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశాడు.

పామిడి: కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వితంతువుకు వలంటీర్ పింఛన్ అందించాడు. వివరాలు..పట్టణానికి చెందిన బెస్త లక్ష్మీదేవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ మణికంఠ ఆదివారం కర్నూలు(దాదాపు 250 కి.మీ దూరం) వెళ్లి లక్ష్మీదేవికి పింఛన్ సొమ్ము అందించాడు.



లక్ష్మీదేవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మణికంఠ

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



లైటింగ్ ఏర్పాటు చేసిన సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు

పెద్దవడుగూరు : జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు యాడికి సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల డీఐజీ అమ్మిరెడ్డి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేయడానికి వచ్చిన సమయంలో గుత్తిఅనంతపురం గేట్స్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై చీకటి ఉండటాన్ని గమనించి లైటింగ్ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆదివారం సీఐ గుత్తిఅనంతపురం సర్పంచ్ మురళీధర్‌రెడ్డి సాయంతో లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ సూచించారు.

నవంబర్‌లో టిడ్కో ఇళ్లు అప్పగిస్తాం

- జీసీ సంక్షేమ హాస్టల్ రీ ఓపెన్‌కు జీఓ జారీ
- వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వైవీఆర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైవీఆర్

గుంతకల్లు: వచ్చే నవంబర్‌లో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయని, దాదాపు 2,160 మందికి లబ్ధి కలుగుతుందన్నారు. గుంతకల్లులో మూతపడిన బీసీ సంక్షేమ హాస్టల్‌ను రీ ఓపెన్ చేయడానికి ప్రభుత్వ జీఓ జారీ చేసినట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు రూ.34.74 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దాదాపు రూ.22 కోట్లతో గుంతకల్లు, గుత్తి, పామిడి ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో దశాబ్దాల కలగా ఉన్న బ్లడ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తెచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. ఇక పట్టణ అభివృద్ధికి అవరోధంగా ఉన్న ధర్మవరం ఎల్‌సీ గేట్ ఎత్తివేయడానికి రైల్వే జీఎంతోపాటు రైల్వేబోర్డుపై ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు అక్కడ ఆర్‌యూబీ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సత్యనారాయణపేటలోని కసాపురం రైల్వే మోరీ వంతెన విస్తరణకు ఇప్పటికే మున్సిపాలిటీ, రైల్వే, ఆర్‌అండ్‌బీ సంయుక్తంగా సర్వేలు నిర్వహించాయని, త్వరలోనే ఆ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్‌డీఓ కార్యాలయం ఏర్పాటు, గుంతకల్లు పోలీసు సబ్ డివిజన్ (డీఎస్పీ) పరిధిలోకి గుత్తి, పామిడి పోలీసుస్టేషన్లు విలీనం చేసినట్లు తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవతో గుంతకల్లు నియోజకవర్గంలో నాలుగేళ్లలో రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, ఇక సంక్షేమ పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు వేలాది కోట్ల లబ్ధి చేకూరిందని స్పష్టం చేశారు. అయితే ప్రతి పక్షాల పార్టీలు జగనన్న ప్రభుత్వంపై చౌకబారు ఆరోపణలు చేస్తూ ప్రజల చేత చీత్కారానికి గురవుతున్నాయన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎస్.రామలింగప్ప, జింకల రామాంజనేయులు, సంస్కృతి విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున శాస్త్రి, జేసీఎస్ మండల ఇంచార్జ్ ఎన్.గోవింద్‌నాయక్, నాయకుడు నూర్‌నిజామి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు,జక్కలచెరువు ఆర్‌ఎస్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ నోడల్ అధికారులు పథకాల పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

గుత్తి రూరల్: అబ్బేదొడ్డి గ్రామంలో సిద్దిబాషా అనే వ్యక్తి మృతి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు నగదును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటి వద్దకు వెళ్లి భార్య సలీమాకు అందజేశారు. మిగిలిన రూ.90 వేలు నామినీ సలీమా బ్యాంకు ఖాతాలో జమవుతుందని సచివాలయ ఉద్యోగులు తెలిపారు.

రేపు ఊబిచెర్లలో 'జగనన్న సురక్ష'

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

గార్లదిన్నె: కల్లూరు గ్రామసచివాలయం-1, 2లో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోత్స్న పేర్కొన్నారు. అవసరమైన వారికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



విన్నర్స్‌కు చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

శింగనమల: క్రీడల్లో గ్రామీణ యువత రాణించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. తరిమెల గ్రామంలో కంచిరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ, వైఎస్సార్‌సీపీ నేత కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గత నెల 15న ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి క్రికెట్ ప్రీమియర్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ బుక్కరాయసముద్రం, వెంకటాపురం జట్ల మధ్య జరిగింది. ఇందులో బుక్కరాయసముద్రం విజేతగా నిలిచింది. ఈసందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బుక్కరాయసముద్రం జట్టు రూ.25,016, వెంకటాపురం జట్టుకు రూ.15,016, రోటరీపురం జట్టుకు రూ.10,016ల చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారని జెడ్పీ చైర్‌పర్సన్ గుర్తు చేశారు. పోటీలను నిర్వహించిన జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధను అభినందించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరిష్‌కుమార్ యాదవ్, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, కంచిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఏపీ క్రికెట్ అసోసియేషన్ మెంబర్ రాజమోహన్‌రెడ్డి, సప్తగిరిరెడ్డి, రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, నాయకుడు చెన్నకేశవులు, ఆర్గనైజర్లు రమేష్, మారుతి, కుమార్, గిరిరాజు, మల్లి, మాధవ, రవి, బాలు, హరి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి నుంచి అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు



అరుణాచలానికి బస్సులను పంపుతున్న డీఎం శంకర్

తాడిపత్రి అర్బన్: తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి గురుపౌర్ణమిని పురస్కరించుకుని తాడిపత్రి డిపో నుంచి 4 ప్రత్యేక సర్వీసులను పంపినట్లు ఆర్టీసీ డీఎం శంకర్ తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక డిపో నుంచి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రతి నెలా పౌర్ణమికి తాడిపత్రి డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను నడుపుతామన్నారు. అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ నందిని, బస్టాండ్ మేనేజర్ పుల్లయ్య, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు: తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికుల కోసం ఈ నెల 31న గుంతకల్లు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనజర్ బి.నారయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ప్యాకేజీ కింద గుంతకల్లు నుంచి అరుణాచలానికి రానుపోను పెద్దలకు రూ.1,900, పిల్లలకు రూ.1,050 ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రయాణ మార్గమధ్యంలో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల భక్తుదులు సీటు రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7382871477, 9660493616 నంబర్లలో సంప్రందిచాలని విజ్ఞప్తి చేశారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, అధ్యక్షుడు వెంకటేశులు, రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి పేర్కొన్నారు. మండలంలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను ఆదివారం అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అనంతరం ఏపీటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు ఎన్నుకున్నట్లు రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి తెలిపారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

యల్లనూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వివిధ కారణాలతో అర్హత ఉన్నా పథకాలు అందని వారు ఉంటే వారికి న్యాయం చేయాలని కార్యక్రమం చేపట్టారన్నారు. మండలంలోని 11 సచివాలయాల్లో వేలల్లో సర్టిఫికెట్లు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా జారీ చేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్టీపీ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



ఎస్టీపీని పరిశీలిస్తున్న కమిషనర్ రవి

తాడిపత్రి అర్బన్: మురుగు నీటి శుద్ధి కేంద్రం(ఎస్టీపీ) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన పట్టణ శివారులోని ఎస్టీపీని పరిశీలించారు. ఆ తర్వాత మహాత్మాగాంధీ సర్కిల్ వద్ద చేపడుతున్న అండర్ డ్రేనేజీ మరమ్మతులను పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, సిబ్బంది ఉన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

పట్టణంలోని సంజీవనగర్ 4వ రోడ్డులో ప్రజలకు పొడి, తడి చెత్తపై మున్సిపల్ కమిషనర్ జి.రవి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటిలోనే తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరు చేసి మున్సిపల్ గార్బేజ్ వాహనాల్లో వేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని తెలియజేశారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 సాలాగ్రామ శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఐరావత వాహనంపై రుక్మిణీ పాండురంగస్వామి



ఐరావత వాహనంపై రుక్మిణీ పాండురంగ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలో రుక్మిణీ పాండురంగస్వామి ఆషాఢ మాస బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ఐదోరోజుకు చేరుకున్నాయి. స్థానిక పెద్ద, చిన్న విఠోబ దేవాలయాల్లో రుక్మిణీ పాండురంగ స్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్న విఠోబ ఆలయంలో రంగ పిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాల్లో కులస్తులు సామూహిక భోజనాలు చేశారు. అనంతరం దిండి భజనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను ఐరావత వాహనంపై ఊరేగించారు. మంగళహారతి అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

భావసార క్షత్రియుల అభ్యున్నతే ధ్యేయం

భావసార క్షత్రియుల అభ్యున్నతికి పాటుపడతానని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక భోగేశ్వరాలయంలో డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. చదువులో ప్రతిభచూపిన భావసార క్షత్రియ విద్యార్థులకు ఎమ్మెల్యే నగదు ప్రోత్సాహం అందించారు. అనంతరం ఎమ్మెల్యే వైవీఆర్‌ను డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ రఘునాథ్‌కుమార్ దత్తు, జీ రాజశేఖర్‌రావు, ముకుందారావు, ఫిర్కా సభ్యులు జే శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కూలీల వలసలు ఆపండి

తాడిపత్రి అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీల వలసలు ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం(సీపీఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు చివరి వారంలో సంఘం జిల్లా మహాసభలు తాడిపత్రిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగయ్య, ఉపాధ్యక్షులు ఎస్.నాగరాజు, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ, టిప్పర్ పట్టివేత

యాడికి: ఎటువంటి పత్రాలు లేకుండా కంకరను తరలిస్తున్న లారీ, టిప్పర్‌ను గనులు, భూగర్భ శాఖ అధికారులు ఆదివారం సాయంత్రం రాయలచెరువులోని చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తగిన అపరాధ రుసుం చెల్లించి వాహనాలను తీసుకుపోవాలని ఎస్‌ఐ ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి వాహన యజమానులకు సూచించారు.

'నాడు-నేడు' పనులు వేగవంతం చేయండి

గుత్తి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని హరితా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ నాయక్ అధికారులను కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొన్ని పాఠశాలల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని దీంతో విద్యార్థులు దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నారన్నారు. బసినేపల్లి తండా, కొజ్జేపల్లి పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరాయని, నూతన భవనాలను నిర్మించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు: కాశేపల్లి సమీపంలోని ముళ్లపొదల్లో ఆదివారం పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.10,040 స్వాధీనం చేసుకున్నామన్నారు.

పాస్టర్‌కు సన్మానం

పామిడి: పట్టణ సీఎస్‌ఐ చర్చి కొత్త పాస్టర్‌గా రెవరెండ్ బీ విశ్వమోహన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న పాస్టర్, గుత్తి డివిజినల్ ఛైర్మన్ రెవరెండ్ జీ డేవిడ్‌నాయక్ గుత్తి ఆర్‌ఎస్ సీఎస్‌ఐ చర్చికి పాస్టర్‌గా వెళ్లారు. ఈసందర్భంగా నూతన పాస్టర్ బీ సువర్ణ విశ్వమోహన్ కుటుంబాన్ని స్థానిక సీఎస్‌ఐ చర్చి సభ్యులు ఘనంగా సన్మానించారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, కిష్టఫర్ బాబు, బుజ్జిబాబు, రూఫస్, ప్రసాద్, రజని, మంజుల, ప్రిస్కిల్లా, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి తీవ్రగాయాలు



గాయపడిన వెంకట సంజయ్,సుబ్బయ్య

తాడిపత్రి: చుక్కలూరు క్రాసింగ్ వద్దఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు. పట్టణంలోని నంద్యాల రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న వెంకట సంజయ్, భరత్(బాలుడు) బైక్‌పై వస్తుండగా నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం, తుమ్మలపెంటకు చెందిన బైక్‌ను ఎదురెదురుగా ఢీకొన్నారు. ఘటనలో బైకులపై ఉన్న ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐటీఐ కళాశాలల ఫీజుల దోపిడీ అరికట్టాలి

గుంతకల్లు: ప్రైవేట్ ఐటీఐ కళాశాలల ఫీజుల దోపిడీ అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక న్యూటెక్ ప్రైవేట్ ఐటీఐ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండేళ్లకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.70 వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పరీక్షల్లో పాస్ చేయిస్తామని ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 వేలు అదనంగా వసూలు చేస్తూ మాస్ కాపీయింగ్ చేయిస్తున్నారని ఆరోపించారు. ఫీజులు చెల్లించుకుంటే హాల్‌టికెట్లు ఇవ్వమని విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. నాయకులు చందు, చరణ్, చెర్రి, దినేష్‌రెడ్డి, సమీర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభయ్యే స్పందనలో ఫిర్యాదు చేసే వారు తప్పకుండా ఆధార్, సెల్ నంబర్ వేయాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు.

యల్లనూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమానికి మండల అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ సుమతి కోరారు. సమస్యలున్న వారు అర్జీల రూపంలో తీసుకురావాలని సూచించారు.

వృద్ధురాలు అదృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణంలో ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు..పట్టణంలోని విజయనగర్ కాలనీలోని శ్వేతదీపంలో తహసీల్దార్ నారాయణస్వామి నివాసముంటున్నారు. నారాయణస్వామి తల్లి టి.పుల్లమ్మ ఆదివారం సాయంత్రం ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి రాలేదు. దీంతో తహసీల్దార్‌కు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు 'ప్రజావేదిక'

పుట్లూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం సామాజిక తనిఖీపై ప్రజా వేదిక(బహిరంగ సభ) నిర్వహించనున్నట్లు ఏపీఓ చెన్నకేశవులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా గతేడాది చేపట్టిన పనులపై క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ పూర్తయిందని పేర్కొన్నారు. తనిఖీల్లో వెల్లడైన అంశాలను తనిఖీ బృందం సభ్యులు ప్రజా వేదికలో వివరిస్తారని తెలిపారు.

బార్బర్ షాప్ ఏర్పాటు అడ్డగింత



ఆందోళన చేపట్టిన నాయీ బ్రాహ్మణులు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లో ఇతర కులస్తులు ఆదివారం బార్బర్ షాప్ ఏర్పాటు చేయడాన్ని నాయీ బ్రాహ్మణులు అడ్డుకున్నారు. నాయీ బ్రాహ్మణుల సంఘం మాజీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, సునీల్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నారాయణస్వామి, సభ్యులు శీనా, బాబు, అంజనేయులు, రమేష్, రాజా, నాగరాజు, అశోక్, కెఎం రాజా, నారాయణ , తిరుపాల్, ఆది, శ్రీరంగా, సంజీవ, పురుషోత్తం, నాగేంద్ర తదితరులు షాపు వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం గుంతకల్లు కెళ్లి ఇతర కులస్తులు, రాష్ట్రాల వారు బార్బర్ షాపులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఆ తర్వాత మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సీఐ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ మహబూబ్ బాషాకు కూడా వినతిపత్రాలు అందజేశారు.

ఇసుక టిప్పర్ సీజ్

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం సెబ్ పోలీసులు సీజ్ చేశారు. వివరాలు.. కొత్తపేట గ్రామ శివారులో సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తాడిపత్రి వైపు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న టిప్పర్‌ను ఆపి సెబ్ పోలీసులు రికార్డులను పరిశీలించారు. అయితే టిప్పర్ డ్రైవర్ మహేష్ వద్ద ఎలాంటి రికార్డులు లేక పోవడంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని అనంతరం సివిల్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ ఎస్‌ఐ అలీ అహ్మద్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాడదాం

గుంతకల్లు రూరల్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా దళితులు ప్రతి ఒక్కరూ పోరాడదామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక దళిత మహాసభ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా జాతి భవిష్యత్ కోసం అంతిమ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. దళితులను దేశ పాలకులుగా తయారు చేసే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నాయకులు వెంకటేశులు, నరసింహులు, హరిశ్చంద్ర, లక్ష్మీనారాయణ, శామ్యూల్, సునిత తదితరులు పాల్గొన్నారు.